# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

**తేదీ: 28-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు**

## ముఖ్యాంశాలు

- ❖ విశాఖ జిల్లాలో శతశాతం ఓటింగ్ కు ఓటర్లు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పిలుపునిచ్చారు.
- ❖ సార్వత్రిక ఎన్నికలు వచ్చే ఐదేళ్ల రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించేవని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.
- ❖ గత ప్రభుత్వం హయాంలో ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసామని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- ❖ పోలింగ్ విధులకు హాజరయ్యే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు.
- ❖ రాష్ట్రంలో రానున్న రెండు రోజుల్లో ఉత్తర కోస్తాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణం కేంద్రం వెల్లడించింది.

=======================

ఈ సార్వత్రిక ఎన్నికలు వచ్చే ఐదేళ్ల రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించేవని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ రోజు నెల్లూరు జిల్లా వెంకటగిరిలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, 3 వేల రూపాయల పెన్షన్ అమ్మఒడి, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, నాడు నేడు పథకాలు పేర్లు చెబితే గుర్తుకొచ్చేది జగన్ మాత్రమేనని అన్నారు. నాడు-నేడుతో స్కూళ్ల రూపురేఖలను మార్చామని జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు.

=======================

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ జిల్లాలో శతశాతం ఓటింగ్ నమోదు లక్ష్యంగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ ఏ మల్లిఖార్జున, జనరల్ అబ్జర్వర్ అమిత్ శర్మ పిలుపునిచ్చారు. క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం (స్వీప్) కార్యక్రమంలో భాగంగా ఈ రోజు బీచ్ రోడ్

లో "రన్ ఫర్ ఓట్" పేరుతో నిర్వహించిన 5కె రన్ ర్యాలీలో వారు పాల్గొని కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...

(వాయిస్ 17 సెకన్లు)

జనరల్ అబ్జర్వర్ అమిత్ శర్మ మాట్లాడుతూ.. జిల్లా ఎన్నికల యంత్రాంగం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు.

========================

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ విధులకు హాజరయ్యే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులు మే 5వ తేదీన, పోలీసు సిబ్బంది మే 6వ తేదీన, అత్యవసర సేవల, ఇతర శాఖల సిబ్బంది మే 7వ తేదీన పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలియజేశారు. నిర్దేశించిన రోజుల్లో ఓటుహక్కును వినియోగించుకోవడానికి వీలుకాని సిబ్బంది ఈ మూడు రోజుల్లో ఒక రోజు వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

========================

తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం హయాంలో ముస్లింలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసామని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నెల్లూరు లోని షాదీ మంజిల్ లో ముస్లింలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, తాము అధికారంలో ఉన్నప్పుడు విజయవాడ, కడపలో హజ్ హౌస్ లు, 8 కోట్ల రూపాయాలతో షాదీ మంజిల్ భవనాలను నిర్మించామని పేర్కొన్నారు. టీడీపీ హయాంలోనే హైదరాబాద్ లో ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశామని చంద్రబాబు నాయుడు వివరించారు.

========================

రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రిసెప్షన్ సెంటర్ల ఏర్పాటు ప్రణాళికా బద్ధంగా ఉండాలని, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని విజయనగరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఈ రోజు కలెక్టరేట్ ఆడిటోరియంలో రిసెప్షన్ సెంటర్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పిఓలు, ఏపిఓలు సులువుగా రిసెప్షన్ సెంటర్లకు చేరుకునే విధంగా దారి చూపే బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఒక్కొక్క నియోజకవర్గానికి సుమారు 10 నుంచి 12 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఒక్కో రిసెప్షన్ సెంటర్‌కు ఇద్దరు జిల్లా అధికారులను ఇన్‌ఛార్జులుగా నియమించామని ఆమె తెలిపారు.

విరామం

========================

రాష్ట్రం లో రానున్న రెండు రోజుల్లో ఉత్తర కోస్తాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి లోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. అలాగే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 30- 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణం కేంద్రం అధికారి పేర్కొంటూ..

(వాయిస్ 26 సెకన్లు)

========================

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విశాఖపట్నం జిల్లా తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ ఆధికారి, జిల్లా సంయుక్త కలెక్టర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో ఆరిలోవ, కృష్ణా కళాశాల పరిధిని పోలింగ్ కేంద్రాలను ఆయన ఈ రోజు పరిశీలించారు. అనంతరం ఎన్నికలు సజావుగా సాగేందుకు, ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.

========================

ప్రజలకు చేయగలిగేది మాత్రమే వైసీపీ మేనిఫెస్టోలో చేర్చామనీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఈరోజు తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధ్యత కలిగిన నాయకుడిగా జగన్ మోహన్ రెడ్డి మేనిఫెస్టో ప్రకటించారని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో లక్షలాది కుటుంబాలకు మంచి జరిగిందని తెలిపారు.

========================

తిరుపతి - శ్రీకాకుళం రోడ్, యశ్వంతపూర్-గయా మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. వేసవి సెలవుల నేపథంలో రద్దీకి అనుగుణంగా ఆయా మార్గాల్లో ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొంది. తిరుపతి – శ్రీకాకుళం రోడ్ మధ్య మే 5, 12వ తేదీల్లో, శ్రీకాకుళం-తిరుపతి మధ్య మే 6, 13వ తేదీల్లో ప్రత్యేక రైలు నడడనున్నట్టు పేర్కొంది. అలాగే యశ్వంత్‌పూర్ – గయా మధ్య ఈ నెల 27 నుంచి మే 25 వరకు ప్రతి శనివారం, గయా – యశ్వంత్‌పూర్ మధ్య ఈ నెల 29 నుంచి మే 27 వరకు ప్రతి సోమవారం రైళ్లు రాకపోకలు సాగిస్తాయని రైల్వేశాఖ వెల్లడించింది.

========================

విశాఖపట్నం పోర్టుకు మొదటిసారిగా ఒక అంతర్జాతీయ క్రూయిజ్ నౌక చేరుకుంది. “ది వరల్డ్” అనే పేరు గల ఈ అంతర్జాతీయ క్రూయిజ్ నౌకకు పోర్టు అధికారులు సాంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. ఈ నౌక సుమారు 80 మంది ప్రయాణికులతో విశాఖ పోర్టుకు చేరుకుంది.

========================

అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలు, శాశ్వత అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఈ రోజు శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రజల కష్టాలు తీర్చేందుకు అనేక సంస్కరణలు తీసుకువచ్చామని తెలియజేశారు.

========================

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు ఐక్యంగా పని చేయాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ అధికారులకు సూచించారు. ఈ రోజు చిత్తూరు జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో సెక్టోరియల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, తహాశీల్దార్లుకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిబ్బంది ఎన్నికల విధుల్లో చురుగ్గా పాల్గొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మే 13వ తేదీన పోలింగ్ నేపథ్యంలో ఎన్నికల సామగ్రికి సంబందించి పోలింగ్ కు ముందు రోజు, తర్వాత రోజు నిర్వహించాల్సిన విధులపై అధికారులకు శిక్షణ ఇచ్చారు.

========================

విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ అధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని గుంటూరు నగరంలో రేపటి నుండి మే 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ శిక్షణా శిబిరంలో క్రీడలు, కధలు చెప్పటం, స్పోకెన్ ఇంగ్లీషు, చిత్రలేఖనం, సంగీతం వంటి పలు అంశాలలో శిక్షణ అందించనున్నారు.

========================

========================